## శరవేగంగా రహదారి పనులు

**ప్రజాశక్తి - చింతపల్లి :** మండలంలోని కొమ్మంగి పంచాయతీ లంకపాకలు గ్రామంలో ఎట్టకేలకు మంజూరైన సిమెంట్ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆ పంచాయతీ సర్పంచ్ పాంగి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జర్త రూతు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి లంకపాకల గ్రామాన్ని సందర్శించిన సమయంలో గ్రామస్తుల కోరిక మేరకు రూ.15 లక్షల నిధులు మంజూరు చేయడమే గాక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు 5 లక్షలతో గ్రామంలో సిమెంట్ రహదారి నిర్మాణానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. రోడ్డు పనులు పూర్తయితే పలు గ్రామాలకు రహదారి సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు మరింత చొరవ తీసుకొని మిగిలిన వీధులలో సిమెంట్ రహదారి ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# సమ్మె శిబిరాల్లో క్రిస్మస్ వేడుకలు

**▸▸కేకు కట్ చేసి నిరసన తెలిపిన అంగన్వాడీలు**

**▸▸సిఎం జగన్‌కు మారు మనసు ప్రసాదించాలని ప్రార్థనలు**

రాజవొమ్మంగిలో కేకు కట్ చేస్తున్న అంగన్‌వాడీలు

**ప్రజాశక్తి-చింతూరు :** అక్కాచెల్లెమ్మలకు అండగా ఉంటానని నమ్మబలికి, నేడు అంగన్వాడీలను రోడ్డెక్కేలా చేసిన సిఎం జగన్‌కు, వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వెంకట్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె 14వ రోజుకు చేరిన సందర్భంగా సోమవారం క్రిస్మస్ రోజున సమ్మె శిబిరాల్లోనే కేక్‌లను కట్‌చేసి, అంగన్వాడీలు నిరసన చేపట్టారు. అంగన్వాడీల సమస్యల పట్ల ముఖ్యమంత్రి మొండివైఖరి సరికాదన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టి సచివాలయ సిబ్బందిని కాపలా పెట్టారని, రేపటినుంచి మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పడుతున్న నేపథ్యంలో సచివాలయ సిబ్బందితో పారిశుధ్య పనులు చేయిస్తారాయని ప్రశ్నించారు. నియంత పోకడలను మాని అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, సిఐటియు చింతూరు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, అంగన్వాడీ కార్మికులు వెంకటరమణ, జయ, చిట్టమ్మ, కిట్టమ్మ, సత్యవతి, దుర్గ, విజయ, నూకరత్నం, లక్ష్మి. పాల్గొన్నారు.

చింతూరులో...

**విఆర్. పురం :** అంగన్వాడీల సమ్మెపై పభుత్వ నిరంకుశ విధానాన్ని వ్యతిరేకిస్తూ దీక్షాశిబిరాల్లో క్రిస్మస్ కేక్ కట్ చేసి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం. సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు సున్నం రంగమ్మ, మండల కార్యదర్శి రాజేశ్వరి మద్దతుగా దీక్షల్లో పాల్గొని, అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు, మండల కార్యదర్శి నాగమణి పాల్గొన్నారు.

**సీలేరు:** సమస్యల పరిష్కారానికి సమ్మెబాట పట్టి, క్రిస్మస్ పండుగ రోజున కుటుంబాలను వదిలి అంగన్వాడీలంతా రోడ్డుపైన దీక్షలు చేస్తుంటే, ముఖ్యమంత్రి జగన్, వైసిపి నేతలు కుటుంబాలతో పండుగ వేడుక చేసుకుంటున్నారని సిఐటియు నేత వెంకట్ ఆక్షేపించారు. అంగన్వాడీల దీక్షలు 14వ రోజుకు చేరిన నేపథ్యంలో సోమవారం దీక్ష శిబిరంలో కేకు కట్ చేసి క్రిస్మస్ పండుగను జరుపుకోవడం ద్వారా అంగన్వాడీలు నిరసన చేపట్టారు.

**రాజవొమ్మంగి :** స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహం వద్ద ఏర్పాటుచేసిన అంగన్వాడీల సమ్మె శిబిరంలో సోమవారం కేకు కట్‌చేసి నిరసన చేపట్టారు. అంగన్వాడీల యూనియన్ మండల కార్యదర్శి కె వెంకటలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు, సిహెచ్‌కుమారి మాట్లాడుతూ, ప్రభుత్వం మొద్దునిద్ర వీడి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌కు యేసుక్రీస్తు మారు మనసు ప్రసాదించి, అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేలా కనువిప్పు కలిగించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎల్.సత్యవతి, నూకరత్నం, రత్నం, రాజేశ్వరి, రాధ, రమణి, సుందరమ్మ, మంగ పాల్గొన్నారు.

**సిఐటియు ఆధ్వర్యంలోకొవ్వొత్తులతో ర్యాలీ**

**రంపచోడవరం :** అంగన్వాడీల సమ్మె 14వ రోజున క్రిస్మస్ సందర్భంగా దీక్ష వేదిక వద్ద కేకు కట్ చేసి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు వెలిగించిన కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టి, అక్కడ మానవహారం నిర్మించారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నిరసన నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా కోశాధికారి కె.రామలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మెట్ట వాణిశ్రీ పాల్గొన్నారు.

**అనంతగిరి:**ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో అంగన్వాడీలు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ముందుగా క్రిస్మస్ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం ఆరు బయట వద్ద వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ వెల్ఫేర్ నాయకురాలు సిహెచ్ కళావతి, పి.మంజుల పాల్గొన్నారు

**బిజెపి నేతలకు నిరసన సెగ**

**పెదబయలు:**మండల కేంద్రంలో అంగన్వాడీల నిరసన 14వ రోజుకు చేరింది. సంఘం అధ్యక్షురాలు టి.రాజమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీలు క్రిస్మస్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం టి.రాజమ్మ మాట్లాడుతూ, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలన్నారు.

**బిజెపి నేతలకు నిరసన సెగ**

స్థానిక బిజెపి నాయకులు మద్దతివ్వడానికి రాగా వ్యతిరేకించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నారు కదా అంగన్వాడీలకు సుప్రీం కోర్టు ఆదేశాను ప్రకారం నెలకు రూ.26 వేలు ఇప్పించండి అప్పుడే మా దగ్గరకు రండని నిలదీయడం తో చేసేది లేక వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సన్నిబాబు, మండల కమిటీ నాయకులు కె.శరబన్న, బోండా గంగాధరం, జంపరంగి సునీల్ కుమార్, అంగన్వాడీ హెల్పర్స్ యూనియన్ పద్మ, సుశీల, కొండమ్మ పాల్గొన్నారు

**ముంచింగిపుట్టు:**మండల కేంద్రంలోని అంగన్వాడీల సమ్మె 14వ రోజుకు చేరింది. గిరిజన మహిళ సంఘం (ఐద్వా) మండల అధ్యక్షులు ఈశ్వరి, కార్యదర్శి విజయ, మండల కమిటీ సభ్యులు సమ్మెకు మద్దతు తెలిపారు. విద్యుత్ కార్మికుల యూనియన్ జిల్లా సభ్యులు కే.సత్తిబాబు అంగన్వాడి సమ్మెను సందర్శించి సంపూర్ణ మద్దతు ఎప్పుడూ ఉంటుందని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొర్ర త్రినాథ్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం ఎం శ్రీను, సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు, సిపిఎం కార్యదర్శి భీమరాజు రామదాసు, ఐద్వా మండల కమిటీ సభ్యులు మీనా, రాధమ్మ, అంగన్వాడి వర్కర్స్ మండల నాయకులు సత్యవతి, మావులమ్మ, ఈశ్వరమ్మ, కాంతమ్మ పాల్గొన్నారు.

**డుంబ్రిగుడ:** సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె మండలంలో కొనసాగుతుంది. సోమవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ రోడ్డు జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కే.కొండమ్మ, కే.సత్యవతి, అంగన్వాడీలు, హెల్పర్లు, పాల్గొన్నారు.

అనంతగిరిలో వినూత్న నిరసన

రంపచోడవరంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

వి.ఆర్.పురంలో నిరసన వృత్తం చేస్తున్న అంగన్వాడీలు

ముంచంగిపుట్టులో..

అవగాహన కల్పిస్తున్న అధికారులు

## డ్రోన్లు వినియోగంపై అవగాహన

**ప్రజాశక్తి - చింతపల్లి:-** గిరి రైతులకు కేంద్ర ప్రభుత్వం పంచాయతీ కేంద్రాల ద్వారా రాయితీపై అందిస్తున్న డ్రోన్లను గిరి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దురియా పుష్పలత కోరారు. స్థానిక పంచాయతీ కేంద్రం వద్ద సోమవారం డ్రోన్లు వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ డ్రోన్లు ఖరీదు 6 లక్షలు రూపాయలు ఉండగా అందులో రైతులకు 40 శాతం రాయితీపై అందిస్తామన్నారు. ఈ డ్రోన్‌తో సమయం ఆదా చేసుకోవచ్చని, ఎనిమిది నిమిషాలలో ఒక ఎకరం పిచికారి పనులు పూర్తి చేయవచ్చన్నారు. ఎరువులు, విత్తనాలు డ్రోన్ల ద్వారా చల్లుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వి నగర్ వైద్యాధికారి రాజా రవీంద్ర చౌదరి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేపడుతున్న గ్రామస్తులు

## శ్రమదానంతో రహదారి పనులు

**ప్రజాశక్తి-హుకుంపేట:**తుఫాన్‌తో మండలంలోని ఉర్రాడ బొడ్డపుట్టు నుంచి మదనపురం వరకూ రహదారి కొట్టుకు పోయింది. ఈ రోడ్డు పాడైపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. స్కూల్‌కి పిల్లలు వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు ఆ గ్రామానికి అంబులెన్స్ వెళ్ళలేదు. ఆసుపత్రికి వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కలకు ఈ రహదారి ఆనుకొని 50 గ్రామాలు ఉన్నాయి. దీంతో, స్థానిక సర్పంచ్ సోమెలి సత్యవతి ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతులు చేపట్టారు.ప్రభుత్వం చొరవ తీసుకుని నూతన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు అడేరి రాము, తాంగుల రవి, మజ్జి బాలకృష్ణ, మజ్జి రామారావు, మజ్జి చిన్న మజ్జి బాలయ్య, రామారావు, మహేష్ కోరారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

**జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి నుండి మంగళవారం వరకు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు చర్చల్లో కేకులు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి ఏసుక్రీస్తు గీతాలు ఆలపించారు.**

ప్రజాశక్తి- విఆర్.పురం

క్రిస్మస్ వేడుకలు మండలం వ్యాప్తంగా క్రైస్తవులు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. పలు చర్చలను సుందరంగా అలంకరించారు. చర్చలకు వచ్చిన సంఘస్థులకు, గ్రామ ప్రజలకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. మండలంలోని పలు క్రైస్తవ ప్రార్ధన మందిరాలను ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ పూనెం సత్యనారాయణ, పంకు సత్తిబాబు తదితరులు సందర్శించి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. సంతపాకల వద్ద ప్రార్థన మందిరంలో ఏర్పాటు చేసిన పాటలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని క్రిస్మస్ కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి దూత క్రీస్తు జన్మించిన దినం ఎంతో గొప్పదన్నారు. ఏసు క్రీస్తు జీవితం అందరకీ ఆదర్శప్రాయమని చెప్పారు. పాస్టర్ డేవిడ్ మిస్టాన్ పాల్గొన్నారు. రామవరం చర్చిలో ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు చేతుల మీదుగా సంఘస్థులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సోడి మల్లయ్య, సిహెచ్ సుబ్బారావు, ప్రకాష్, ప్రవీణ్, పాస్టర్ ఎం.రామకృష్ణ, చర్చి సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

**చింతూరు :** మండల వ్యాప్తంగా క్రీస్తు దేవాలయాలు ప్రత్యేక అలంకరణలతో శోభాయమానంగా పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మండల కేంద్రంలోని సిఎస్ఐ చర్చ్, ఎర్రంపేట, నిమ్మలగూడెం, చట్టీ, చిడుమూరు, ఏడుగురాళ్లపల్లి, కాటుకపల్లి ఇంకా పలు గ్రామాల్లో సోమవారం ఉదయం నుండే యేసుక్రీస్తును కీర్తిస్తూ పాటలు ఆలపించారు. కేకులు కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ఆనందకరంగా జరుపుకున్నారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలని క్రైస్తవులు తమ ఇంటి వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రీస్తు దేవాలయంలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**సీలేరు :** జికె.వీధి మండలం సీలేరు యుసిఐఎం, పెంతుకోస్తు, గేస్తుమని తదితర చర్చిల్లో క్రిస్టమస్ వేడుకలు అత్యంత వైభవంగా క్రైస్తవులు జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి అనంతరం చర్చిల్లో కేకులు కట్ చేసి క్రైస్తవులు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి ఏసుక్రీస్తు గీతాలు ఆలపించారు. చిన్నారులు పలు సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొని ఆటపాటలతో అలరించారు. సోమవారం ఉదయం యూసీఐఎం చర్చి పాస్టర్ మనసై బచ్చులూరు యూసిఐఎం నితిన్యా చర్చి పాస్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో ఏసుక్రీస్తుకు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు.

సీలేరు ఇసిఐఎం చర్చిలో కొవ్వొత్తులు వెలిగించి ఏసుక్రీస్తు గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు

**పాడేరు :** జిల్లా వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. క్రీస్తు ప్రార్థన మందిరంలో ప్రత్యేక క్రిస్మస్ ఆరాధనలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ చర్చిలలో ప్రత్యేక కీర్తనలతో పండుగను సంబరంగా జరుపుకున్నారు. సామూహిక విందు కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ చర్చిలలో సంఘ కాపరుల ఆహ్వానం మేరకు ప్రజా ప్రతినిధులు హాజరై క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

**జి.మాడుగుల :** క్రీస్తు జీవితం అనుసరణీయమని ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చిన మహనీయుడని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, జి.మాడుగుల జడ్పిటిసి డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి అన్నారు. జి. మాడుగుల మండలం రచ్చపల్లి చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కరుణామయుడు జీసస్ జననం సమస్త ప్రపంచానికి పవిత్ర దినమని ఆమె తెలిపారు. ఏసుక్రీస్తు పుట్టినరోజు వేడుకల్లో తనను భాగస్వామ్యం చేయడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆయన శిలువపై బలియాగం అయ్యారని తెలిపారు. ఏసుక్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ పాల్గొన్నారు.

**అనంతగిరి :** మండలంలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.మర్దగుడ, పెద్దూరు తదితర చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి కేకులు కట్ చేశారు.ఈ కార్యక్రమంలో మర్దగూడ పాస్టర్ చిట్టం .నీలయ్య, విశ్వాసులు పాల్గొన్నారు.

విఆర్.పురంలో కేక్ కట్ చేస్తున్న సత్యనారాయణ, క్రైస్తవులు

పిల్లలకు కేకు తినిపిస్తున్న వైసిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు వెంకటలక్ష్మి

# తగ్గని కోతుల బెడద

**- ఎపి జెన్‌కో ఉద్యోగిపై దాడి**
**- ముందే హెచ్చరించిన 'ప్రజాశక్తి'**
**- పట్టించుకోని అధికారులు**

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం సీలేరులో కోతులు బెడద రోజు రోజుకు పెరుగుతోంది. గుంపులు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. చిరికి దాడి చేస్తున్నాయి. ఏపీ జెన్కో ఉద్యోగిపై సోమవారం వానర మూకలు అకస్మాత్తుగా దాడి చేసి గాయపరిచాయి.

జీకే.వీధి మండలం సీలేరులో ఏపీ జెన్కో ఉద్యోగి, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.నాగరాజు సోమవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై బజారుకు వస్తుండగా ఎనిమిదవ క్రాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి గుంపులు గుంపులుగా ఒక్కసారిగా వానర మూకలు వచ్చి ఆయనపై దాడి చేశాయి. దీంతో నాగరాజు భయాందోళన గురై ద్విచక్ర వాహనం పైనుంచి కిందకు పడిపోయాడు. నాగరాజు సంఘటన ప్రదేశంలోనే ఉండిపోగా సహచర ఉద్యోగులు చూసి వెంటనే వానర మూకలను చెదరగొట్టారు.

**ముందే హెచ్చరించిన ప్రజాశక్తి .. పట్టించుకోని అధికారులు**

సీలేరులో మూడేళ్ల వరకు కోతులు పదుల సంఖ్యలో ఉండేవి. ఇప్పుడు వృద్ధి చెంది వందల సంఖ్యలో ఉన్నాయి. విచ్చలవిడిగా ఏపీ జెన్కో కాలనీ, మార్కెట్లో, పాఠశాలలో, ఏపీ జెన్కో కార్యాలయాలు, పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. పాఠశాల పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో కోతులు తిరుగుతుండడంతో ఉండడంతో విద్యార్థులను ఏ క్షణంలో ఏం చేస్తాయోనని వారి తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇంటిలోకి కోతులు చొరబడి గృహిణులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఆహార పదార్థాలు ఎత్తుకుపోతున్నాయి. రేకులతో నిర్మించుకున్న ఇళ్లు, షాపులపై గంతులు వేయడంతో పైకప్పు రేకులు దెబ్బతింటున్నాయి. ఈ విషయాలపై రెండు నెలల క్రితం ప్రజాశక్తి వార్తా కథనం ప్రచురించింది. అయినా ఎపి జెన్, ప్రభుత్వ అధికారులు కోతలు పట్టించుకోలేదు. కోతులను నివారించాలని జెన్కో ఉద్యోగులు అనేకసార్లు ఏపీ జెన్కో ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని బాధితుడు నాగరాజు ఈ సందర్భంగా ప్రజాశక్తి వద్ద వాపోయారు. మోతుగూడెం, డొంకరాయి పరిధిలో కోతులు నివారణకు చర్యలు తీసుకున్న జెన్‌కో అధికారులు సీలేరు మాత్రమే పట్టించుకోలేదు. ఇప్పటికైనా సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీరు బి.శ్రీధర్, ఎస్ఈ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకర్, ప్రభుత్వ అధికారులు కోతులు నివారించడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కోతుల దాడిలో చేతికి అయిన గాయాన్ని చూపుతున్న నాగరాజు

### కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి

సీలేరులో కోతులు విచ్చలవిడిగా సంచరిస్తూ తీవ్ర భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. జనావాసాల్లోనూ, మార్కెట్లోనూ గుంపులుగా తిరుగుతూ సామాన్లు ఎత్తుకుపోయి వ్యాపారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తక్షణమే కోతులు నివారణ చర్యలు చేపట్టాలి.

**- ఎం.మణి, అపరాల వ్యాపారి**

### కోతులు నివారణకు చర్యలు చేపట్టాలి

సీలేరులో కోతులు వందల సంఖ్యలో పెరిగిపోయి ప్రజలను నానా అవస్థలు గురి చేస్తున్నాయి. కోతుల వలన ప్రజలకు విద్యార్థులకు ఎటువంటి హాని కలుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. ఇప్పటికైనా ఎపి జోన్‌కో అధికారులు కోతులు నివారణకు చర్యలు తీసుకోవాలి.

**- టి.నాగేంద్రబాబు, ఏపీ జెన్కో కాంట్రాక్టర్**

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరించాలి

**సిపిఎం మండల కార్యదర్శి సీతారామయ్య**

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని బురదగూడెం (హర్వాయిగూడెం) గ్రామంలో గిరిజన రైతుల పొలాల్లో వేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు తీసుకువెళ్లి దానిని తిరిగి పునరుద్ధరించలేదని సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎన్‌టిఆర్ జలశ్రీ పథకం కింద గిరిజన ప్రాంతంలోని రైతుల పొలాల్లో వ్యవసాయ పంపు సెట్ల కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారని తెలిపారు. బోర్లలో నీటి నిల్వ తక్కువ వున్న కారణంగా మోటార్లు పని చేయక గిరిజనులు ఇబ్బంది పడేవారని, దీంతో విద్యుత్‌శాఖ అధికారులు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లారని పేర్కొన్నారు. దీంతో ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో మోటార్ల ద్వారా సాగునీరు అందించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అతి వృష్టి, అనావృష్టి కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులు కొత్త బోరుబావులు తవ్వించుకొని, మోటార్లు పెట్టించుకునే స్థితిలో లేరని తెలిపారు. అందువల్ల విద్యుత్ శాఖ అధికారులు రైతులకు మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే వాడుక లేని విద్యుత్ కనెక్షన్లకు బిల్లులు ఇచ్చారని, వాటిని రద్దు చేయాలని కోరారు.

## ఎస్ఐ పోస్టుకు జిలానీ ఎంపిక

**ప్రజాశక్తి-సీలేరు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్) ఫలితాల్లో జికె.వీధి మండలం సీలేరుకు చెందిన యువకుడు షేక్ జిలానీ ఎంపికయ్యాడు. జిలానీ రెండో సంవత్సరంలో తల్లి షేక్ శతాబ్ది చనిపోవడంతో సీలేరులో తన అమ్మమ్మ షేక్ లాల్‌బీ పోషణలో పెరిగాడు. ఒకటి నుంచి ఆరో తరగతి వరకు తన సొంత గ్రామమైన కాకినాడలో మౌలానా అబ్దుల్ కలాం పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం సీలేరు కాన్వెంట్‌లో ఏడు నుంచి పదవ తరగతి వరకు చదువుకున్నాడు. ఇంటర్మీడియల్, డిగ్రీ బిఎ నాగార్జున సాగర్ ఎపి గురుకుల కళాశాలలో పూర్తి చేశాడు. అనంతరం 2022లో సివిల్ ఎస్సై పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో తన ఇంటి దగ్గర ఉంటూ ఆన్‌లైన్‌లో శిక్షణ పొందిన జిలానీ పట్టుదలతో చదివి, ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. తన అమ్మమ్మ పేదరికంలో ఉన్నప్పటికీ తను ఉన్నత స్థాయికి ఎదగడానికి చదువుకు తోడ్పాటు అందిస్తూ ఎంతో ప్రోత్సహించినట్లు జిలానీ తెలిపారు.

పెంచి పెద్ద చేసిన అమ్మమ్మతో జిలానీ

# ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

**ప్రజాశక్తి -పాడేరు:** కాకినాడలో ఈ నెల 27,28,29, తేదీలలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.చిన్నారావు కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యారంగంలో సమస్యలపై చర్చిస్తారన్నారు. గిరిజన ప్రాంతంలో బీఇడీ, పీజీ కాలేజీలు ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయిలో టీచర్ పోస్టులు భరీత చేసి ద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. గిరిజన విద్యార్థుల మృతిపై విచారణ చేపట్టి, తగ్గు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామన్నారు. ఈ సభకు ముఖ్య వక్తలుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐళ్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ విఠలపు బాలసుబ్రహ్మణ్యం హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలను విద్యార్థులు, ఉద్యోగస్తులు, మేధావులు జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.చిన్నారావు, జిల్లా ఉపాధ్యక్షులు పి.సింహాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'ఆడుదాం ఆంధ్రా' జయప్రదానికి ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు.

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా జరుగు ఆటలు పోటీలు మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభం కానున్నాయి. వీటిని జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం అధికారులు రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ ఆడదాం ఆంధ్రా ఆటల పోటీల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని సచివాలయాల వద్ద మంగళవారం ఆట పోటీలు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆటల పోటీలు

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**నర్సీపట్నం మున్సిపాలిటీ లోని 17 సచివాలయాలలో ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ప్రారంభం కానున్నాయని మున్సిపల్ కమిషనర్ రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పెదబొడ్డేపల్లి ఏపిఆర్ఎస్ పాఠశాల వద్ద జరిగే ఈ పోటీలను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభిస్తారన్నారు. వార్డు మెంబర్లు, కోఆప్షన్ మెంబర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**రావికమతం:** ఈనెల 26 నుంచి ఆడదాం ఆంధ్ర పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని 22 గ్రామ సచివాలయ పరిధిలో ఈనెల 26 నుంచి జనవరి 9వ వరకు సచివాలయ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిం చనున్నామని తెలిపారు. ఈ పోటీలను ఆయా సచివాలయాల కార్యదర్శులు, పీఈటీల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు పోటీలను ప్రారంభించాలని కోరారు. ఈ క్రీడల్లో ఆసక్తి ఉన్న బాల, బాలికలు పాల్గొనాలని ఆయన కోరారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

## ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాశక్తి-గొలుగొండ:**మంలంలోని గింజర్తి, తాళ్ళ చీడికాడ గ్రామంలో సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శిలు మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ మాట్లాడుతూ, దోపిడీదారులకు, పెత్తందారులకు వ్యతిరేకంగా నిరంతరం సిపిఐ పోరాటం చేస్తుందన్నారు.మాయ మాటలు చెప్పి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న ప్రభుత్వాలపై నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శిలు కె.రాంబాబు, పి.బాలరాజు, ఏఐవైఎఫ్ సిహెచ్.భరత్ కుమార్, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని చోద్యం గ్రామంలో సోమవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై గ్రామ సచివాలయంలో అవగాహన కల్పించారు. అనంతరం ఎంపిడిఒ డేవిడ్ రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు తెలిసేలా చేయడం, లబ్ధి పొందేలా చేయడం ఈ కార్యక్రమంలో ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇఒపిఆర్‌డి రఘురాం, గొలుగొండ వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, విప్పల పాలెం సర్పంచ్ శ్రీనివాస్, ఆత్మ సిబ్బంది కిషోర్, కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

## అశ్వ వాహనంపై వెంకన్న ఊరేగింపు

**ప్రజాశక్తి - నక్కపల్లి :** ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అశ్వవాహన సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అర్చక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుని ఉత్సవమూర్తులను అంసవాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, పీసపాటి వేంకట శేషాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు, నందూరి వెంకట రాజగోపాలాచార్యులు, ఇల్లింద వెంకట గోపాలచార్యులు, నందూరి వెంకట అప్పల రంగాచార్యులు, దేవస్థానం సిబ్బంది గురవయ్య గ్రామానికి చెందిన రేజేటి సింగరాచార్యులు, యు.వి. రంగనాథ స్వామి పలువురు భక్తులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

కానిస్టేబుల్ వెంకటేష్ మృతదేహం, పక్కనే ఫైల్‌ఫొటో

**ప్రజాశక్తి- చింతూరు :** మండలంలోని ఏకవారిగూడెం, మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ సున్నం వెంకటేష్ దుర్మరణం పాలయ్యాడు. తన కొడుకు పుట్టిన రోజును పురస్కరించుకుని కుంటలో బట్టలు తీసుకుని గొల్లపల్లి నుంచి కిష్టారం మోటర్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. రెండో ద్విచక్ర వాహనంలో వస్తున్న చింతూరు మండలం సిరస పల్లి గ్రామానికి చెందిన మిడియం దూలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. దూలయ్యను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకటేష్ మృతదేహాన్ని చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

- మన్యవాసులకు వెన్నుదన్నుగా తాటి తేగలు
- సీజన్‌లో ఎక్కడ చూసినా కట్టలుకట్టలుగా దర్శనం
- గిరిజనానికి తాటిచెట్టుతో బహుళ ప్రయోజనం

# తింటే ఆరోగ్యం.. అమ్ముకుంటే ఆదాయం!

వారపుసంతలో తాటి తేగలు అమ్ముతున్న గిరిజన మహిళలు

**ప్రజాశక్తి-చింతూరు :** తాటిచెట్టు చేసే మేలు తల్లి కూడా చేయలేదన్నది అనాదిగా మన్యంలో వినిపిస్తున్న నానుడి. అన్నట్లుగానే తాటిచెట్టుతో ఎన్నో ఉపయోగాలున్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజలు తాటాకులు, కాయలు, పండ్లు, చెట్టు కాండం, పండ్ల నుంచి మొలకెత్తే తేగలు ఇలా అన్నింటితోనూ బహుళ ప్రయోజనాలు పొందుతున్నారు. ముఖ్యంగా శీతాకాల సీజన్‌లో లభించే తాటి తేగలతో తింటే ఆరోగ్యంతోపాటు, అమ్ముకుంటే ఆదాయం సమకూరడం ద్వారా గిరిజనానికి ఎంతో మేలు చేస్తోందని వేరే చెప్పనక్కరలేదు.

**బహు ప్రయోజనకారి తాటిచెట్టు**

ప్రకృతిపరంగా సహజసిద్ధమైన వనరుల ఆధారంగానే కొండకోనల్లో జీవనం సాగిస్తున్న మన్యవాసులకు తాటిచెట్టు పెద్దదిక్కుగా ఉంటోంది. మిగతా చెట్లతో పోల్చుకుంటే తాటి చెట్లు నుంచి ఎన్నో లాభాలను ప్రజలు పొందుతున్నారు. ఏజెన్సీలో విరివిగా ఉండే తాటిచెట్లు ఆదివాసీలకు గూడు, నీడతోపాటు ఫలసాయంతో ఆహారాన్ని, ఉపాధిని అందిస్తోందంటే అతిశయోక్తి కాదు. ఒకపుడు ఇంటి నిర్మాణాల్లో తాటిచెట్టుదే పెద్దపాత్ర, తాటి కాండాన్ని రాటలుగా, పైకప్పుకు వాసాలుగా వినియోగించి ఒక గూడును నిర్మిస్తే, తాటాకులతో ఇంటి పైకప్పు వేయడం ద్వారా ఎండావానలతో రక్షణ కల్పించడమే కాకుండా,చ ల్లని వాతావరణంతో కూడిన గూడును కల్పిస్తోంది. కాలక్రమేణా మైదాన ప్రాంతాల్లో తాటాకిళ్లు కనుమురుగైనప్పటికీ ఇప్పటికీ ఏజెన్సీలో పలుచోట్ల ఇళ్లగాను, పశువుల పాకలుగాను తాటాకిళ్లను ఉపయోగిస్తున్నారు. ఇక ఏటా భద్రాచలంలో జరిగే రాములోరి కల్యాణానికి లక్షల సంఖ్యలో తాటాకులు మన్యం నుంచి అక్కడకు తరలివెళ్లి చలువ పందిళ్లు నేటికీ ఆనవాయితీగా వేస్తున్నారు. ఇప్పటికే పెళ్లిళ్లు, ఇతరత్రా శుభకార్యాల్లో తాటి పందిళ్లే దర్శనమిస్తాయి. ఎసిలు, కూలర్లు వంటివి అందుబాటులోకి వచ్చిన నేటిరోజుల్లో తాటాకులతో తయారుచేసిన విసనకర్రలనే పల్లె, పట్టణ ప్రాంతాల్లో చాలామంది వాడుతున్నారంటే వేసవిలో వీటికెంత గిరాకీ ఉంటుందో వేరే చెప్పనక్కరలేదు.

**తాటి తేగలతో ఎన్నో లాభాలు**

ఇక వేసవిలో తాటిముంజెలకున్న ప్రాధాన్యత వేరే చెప్పనక్కరలేదు. మండుటెండలతో అల్లాడే జనానికి చలువతోపాటు ఆరోగ్యాన్ని ఇచ్చే పదార్థాలలో రుచికరమైన తాటిముంజెలు ముందు వరుసలో నేటికీ

అమ్మకానికి సిద్ధం చేసిన కాల్చిన తాటి తేగలు

ఉంటున్నారు. ఏడాదికోసారైనా తాటిముంజెలు తినని వారున్నారంటే అతిశయోక్తి కాదు. ఇక శీతాకాలం ప్రారంభంలో తాటికాయల నుండి మొలిచిన తాటి తేగలు విరివిగా లభిస్తాయి. వీటిని కాల్చి, ఉడకబెట్టి తింటుంటారు. తాటి తేగలు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు తాటితేగలు తింటే రక్త ప్రసరణ చక్కగా జరిగి ఉపశమనం కలుగుఉంది. తేగల్లో మెగ్నీషియం, కార్బోహైడ్రేట్లు 20శాతానికిపైగా ఉండడంతోపాటు, పీచు పదార్థం (ఫైబర్) అధికంగా ఉండటంతో జీర్ణవ్యవస్థ మెరుగుపడి మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుందని, తాటితేగలను నమిలి తినే క్రమంలో ఇందులోని పీచుతో దంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడంతోపాటు అనేక దంత సమస్యలకు ఔషధంగా పనిచేస్తుందని వైద్యనిపుణులే అంటున్నారు. తేగలు తినడంతో పేగుల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగిపోవడంతోపాటు క్రిములుంటే అవి నశించి జీర్ణక్రియకు దోహదపడతాయి. ఎముకలు, దంతాల పటిష్టతకు తాటితేగలు ఎంతగానో ఉపయోగపడతాయని అంటున్నారు. తాటిమంజెలు, టెంకల్లోని గుజురు ఎంతో రుచి, ఆరోగ్యకరంగా ఉండడంతోపాటు గాను మంచి ఔషధంగా కూడా మనిషికి ఉపయోగపడుతుంది. తాటిచెట్ల నుంచి కల్లును సేకరించి నేటికీ గిరిజనులు ఉపాధి పొందుతున్నారు.

**ఆదాయాన్నిస్తున్న తాటితేగలు**

శీతాకాలం వచ్చిందంటే పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసిన తాటితేగలే దర్శనమిస్తుంటాయి. గిరిజన గ్రామాల్లో ప్రజలు తాటి తేగలను కాల్చి లేదా ఉడకబెట్టి కట్టలుగా కట్టి విక్రయించడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. మంచి పోషక విలువలతో రుచిగా ఉండడంతోపాటు ఆరోగ్యానికి మేలు చేకూర్చే సహజసిద్ధమైనవి కావడంతో వీటిని కొని, తినేవాళ్లకు కొదవ లేదు. తద్వారా తాటిచెట్లు, వాటి తేగలు ప్రజలకు ముఖ్యంగా మన్యవాసులు బహుళ ప్రయోజనకారి అంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి.

# చాపరాయి అందాలకు అదనపు హంగులు

చాపరాయి జలపాతం

- రూ .40 లక్షలతో ఆధునికీకరణ పనులు
- పర్యాటకులను ఆకర్షించే విధంగా సౌకర్యాలు
- ఐటిడిఏ ఆధ్వర్యంలో ఎకో టూరిజం స్పాట్‌గా అభివృద్ధి

**ప్రజాశక్తి- డుంబ్రిగుడ :** ఆంధ్ర ఊటీగా ప్రఖ్యాతి గాంచిన అందాల అరకులోయ ప్రాంతంలో ప్రకృతి అందాలలో అలరారే ందర్శనీయ ప్రదేశం మండలంలోని చాపరాయి జలపాతం. ఈ జలపాతం పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తుంది. ఇక్కడ సందర్శించిన పర్యాటకులు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా జలపాతంలో సరదాగా స్థానాలు చేస్తూ ఆనందంగా గడుపుతారు. దీనికి తోడు శీతకాలంలో తెల్లవారు జామున కురిసే పొగ మంచలో ప్రత్యేక ఆకర్షణగా ఇక్కడి ప్రకృతి అందాలను పర్యాటకులు తిలకిస్తూ ఎంతో ఆనందంగా ఆస్వాదిస్తున్నారు.అన్ని సీజన్లలోనూ పర్యాకుల తాకిడి ఉన్న చాపరాయి జలపాతం వద్ద ఇప్పటివరకు కనీస స్థాయిలో సౌకర్యాలు లేవు. ఈ నేపథ్యంలో పర్యాటకుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, గార్డెన్ తో పాటు చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఇతర సౌకర్యాలు కల్పనకు చర్యలుచేపడుతున్నారు.

ముఖద్వారం ఆధునికీకరణ పనులు

చాపరాయి జలపాతాన్ని గత ఏడాది నుంచి తమ అధీనంలో తీసుకొన్న ఐటిడిఎ, ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజంగా పలు అభివృద్ధి పనులను చేపడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా పలు సుందరీకరణ పనులు చేపడుతోంది. రూ.40 లక్షలతో పర్యాటకుల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించి వాడుక నీటి సౌకర్యం కల్పించడంతో పాటు ప్రహరీ నిర్మించి, పూల తోటలతో ఆకర్షణగా గార్డెన్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిన్నపిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక ఆట సౌకర్యాలు కల్పించడంతోపాటు గిరిజన థింసా కళాకారులు థింసా ప్రదర్శన చేయడానికి ప్రత్యేక స్టేజిని నిర్మిస్తున్నారు. కార్తీకమాసంలో అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చిన వారు లోపలికి ప్రవేశించేటప్పుడు ఎటువంటి రద్దీ ఏర్పడకుండా ప్రవేశ గేట్లు, మెట్లును వెడల్పుగా నిర్మించి ఆకర్షణగా టైల్స్‌తో తయారు చేస్తున్నారు. గతంలో కన్నా ప్రస్తుతం కొన్ని మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తుండటంతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు సీతంపేట పార్కులో ఏర్పాటు చేసిన విధంగా హ్యాగింగ్ బ్రిడ్జి, వంజింగ్ టార్పల్లిన్, కాటేజీలు నిర్మించి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి పర్యాటకులను మరింత ఆకర్షించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు, పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

చాపరాయి జలపాతం వద్ద కల్పిస్తున్న సౌకర్యాలు

## 27 నుంచి రామానాయుడు పాదయాత్ర

**ప్రజాశక్తి-చీడికాడ:**ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే ఈనెల 27వ తేదీ నుండి పాదయాత్ర చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు చీడికాడ మండలంలో అప్పలరాజుపురం గ్రామంలో పార్టీ కార్యాలయంలో సోమవారం చీడికాడ, మాడుగుల మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ, మాడుగుల మండలం శంకరం పంచాయతీ నుండి పాదయాత్ర ప్రారంభమవుతుందని, తాను అధికారంలో లేకున్నా 2002 నుండి 2023 వరకు ప్రజల మధ్యలోనే ఉన్నానన్నారు.ప్రజలకు అవసరమైన సహాయ సహకారాల్లో ముందుండి చేయూత అందిస్తున్నానని తెలిపారు. బుధవారం నుంచి చేపట్టే పాదయాత్రకు ప్రజల ఆశీస్సులు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎలక్షన్లో మాడుగుల నియోజకవర్గం కోటపై ప్రజల ఆశీస్సులతో టిడిపి జెండా ఎగరడం ఖాయమని రామానాయుడు జోస్యం చెప్పారు. నియోజకవర్గంలో 111పంచాయతీలలో ఈ పాదయాత్ర జరుగుతుందన్నారు. ఈ పాదయాత్ర ను కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ఇంచార్జులను మార్చుతున్నా, ఏపీ ప్రజలు మాత్రం ఏకంగా జగన్ రెడ్డినే మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నాటకాలు ఆడిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు వైసీపీని నమ్మరన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీలు పోతల రమణమ్మ, పుప్పాల అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పోతల చిన్నం నాయుడు, కార్యదర్శులు తాతారావు పాల్గొన్నారు.

# జీవనదుల చెంత తాగునీటికి చింత

చెలమల నీటిని సేకరిస్తున్న ఉమ్మడివరం వాసులు

- పోలవరం బ్యాక్‌వాటర్‌తో నీరంతా కలుషితం
- తాగునీటికి అవస్థలు పడుతున్న పరివాహక ప్రజలు
- చెలమలను ఆశ్రయించి అవసరాలు తీర్చుకుంటున్న జనం

**ప్రజాశక్తి- విఆర్.పురం :** సముద్రాన్ని తలపించేలా కనుచూపు మేరలో ఎటుచూసినా నీరే. అలాగని ఉప్పు నీరు కూడా కాదు. కొండకోనలను, ఔషధగుణాలున్న చెట్ల మధ్యగుండా ఉప్పొంగి ప్రవహించి, మైదానప్రాంతానికి దిగొచ్చిన గోదావరి, శబరి నదుల పరివాహక ప్రాంతం, పవిత్ర సంగమం. అటువంటి ప్రదేశంలో నీటికి కొదవ లేకున్నా, తాగునీటికి తిప్పలు తప్పడం లేదంటే ఒకింత వింతగా ఉంటుంది. అయినా ఇది నిజం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో బ్యాక్‌వాటర్ నిల్వ ఉండి పోవడంతోపాటు వ్యర్థాలతో నదీజలాలు కలుషితమై అటు సాగుకు, ఇటు తాగేందుకు పనికిరాకుండా పోతోందని అక్కడి ప్రజలు వాపోతున్నారు.. జీవనదుల చెంత ఉన్నప్పటికీ, ఆరోగ్యకరమైన తాగునీటికి చింతలు తప్పడం లేదని నదీ పరిసర ప్రాంతవాసుల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

విఆర్‌పురం మండలాన్ని ఆనుకుని గోదావరి, శబరి నదులు ప్రవహిస్తున్నా, పోలవరం ప్రాజెక్టు పుణ్యమాని అక్కడ ప్రజలకు తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. మండలంలోని వడ్డిగూడెం, శ్రీరామగిరి, కల్తునూరు, జీడిగుప్ప, కోటార్‌గొమ్ము, పోచవరం, దుమ్ములేరు, కొల్లూరు తదితక గ్రామాల ప్రజలు తాము సురక్షిత తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కొన్నాళ్లక్రితం వరకు ఆయా నదుల నీటినే సాగు,తాగునీటిగా వాడుకుంటున్న స్థానికులంతా నేడు మంచినీటికి కటకట తప్పడం లేదని వాపోతున్నారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నిల్వ పుణ్యమాని స్వచ్ఛంగా ఉండాల్సిన నీరు పచ్చగా మారి కలుషితమైపోయిందని, దీంతో తాగితే రోగాలబారిన పడక తప్పడం లేదంటున్నారు. తాగడానికి, ఇతరత్రా అవసరాలను తీర్చే ఈ నీరు ఇపుడు ఎందుకూ కొరగానిదా ఉందంటున్నారు. తెగించి తాగితే రోగాల బారిన పడడం ఖాయమని, స్నానాలు, ఇతర అవసరాలకు వాడితే చర్మరోగాలు ఖాయమని అంటున్నారు. దీంతో నది ఒడ్డున ఉన్న ఇసుక తిన్నెలతో చలమలు తీసి, అక్కడ నుంచి నీటిని సేకరించి అవసరాలను తీర్చుకుంటున్నామని ఉమ్మడివరం వాసులు అంటున్నారు. నదిలో నీటిమట్టం తక్కువగా ఉన్నపుడు ఇసుక దిబ్బలు కనిపిస్తుండడంతో చెలమలు తీసేందుకు ఆస్కారముంటుందని, అదే వర్షాలు కురిసి, వరదలొస్తే తాగునీటికి కటకట తప్పడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి, తాగునీటికి ఇక్కట్లు ఉన్న గ్రామాల్లో రక్షితనీటి పథకాలను ఏర్పాటు చేసి నీటి కష్టాలకు విముక్తి కల్పించాలని పాలకులు, అధికారులను వేడుకుంటున్నారు.

పుష్కలంగా నీటితో కళకళలాడుతున్న గోదారి, శబరి సంగమం